సాక్షి అనంతపురం

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024



చీనీ టన్ను రూ.24 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి.



టమాట కిలో రూ.22

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.15 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.3°/24.5°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

కలెక్టర్ వినాయకచవితి శుభాకాంక్షలు



అనంతపురం అర్బన్: జిల్లా ప్రజలకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుని ఆశీస్సులతో జిల్లా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆనందమయ జీవితం గడపాలని ఆకాంక్షించారు. పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మట్టి వినాయకుడిని పూజించాలని సూచించారు.

పకడ్బందీగా పశుగణన



మాట్లాడుతున్న డాక్టర్ వెంకటస్వామి

ఉరవకొండ: పశుగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ వెంకటస్వామి ఆదేశించారు. డిసెంబర్ 31 వరకు కొనసాగే పశుగణన ప్రక్రియపై ఉరవకొండలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో డివిజన్ స్థాయి అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ఈ నెల 18 వరకు కొనసాగుతుందన్నారు. పశువుల షెడ్ల నిర్మాణానికి 90శాతం, గొర్రెలు, మేకల షెడ్లకు 70శాతం రాయితీని ప్రభుత్వం ఇస్తోందన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్, పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీకి ఐసీఎస్ఎస్ఆర్ ప్రాజెక్టులు

బుక్కరాయ సముద్రం: మండలంలోని జంతలూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీకి నీతి ఆయోగ్, న్యూఢిల్లీకి చెందిన ఇండియన్ కౌన్సిల్ ఫర్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) వారి రెండు ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులు దక్కాయి. ఈ మేరకు ఆ వర్సిటీ వీసీ డాక్టర్ కోరి శుక్రవారం తెలిపారు. ఏపీలో కెపాసిటీ బిల్డింగ్ యూనివర్సిటీలను పర్యవేక్షించడం, మూల్యాంకణం చేయడమనే పేరుతో కేంద్ర ప్రాయోజిత పథకాలైన రాష్ట్రీయ బాల వ్యవస్థ (ఆర్‌బీఎస్‌కే), రాష్ట్రీయ కిషోర్ స్వాస్థ్య, శక్తి నిర్మాణ్ ప్రభావాన్ని అంచనా వేయడం నీతి ఆయోగ్ ప్రాజెక్ట్ లక్ష్యం అన్నారు. ఈ ప్రాజెక్ట్‌ను యూనివర్సిటీ విద్యార్థులను క్లిష్టమైన విధాన పరిశోధనలలో చేర్చడం ద్వారా వారి విద్య, ఆచరణాత్మక సామర్థ్యాలను మెరుగు పరుస్తుందన్నారు. ఈ విభాగానికి చెందిన పీహెచ్‌డీ, ఎంఎస్సీ, బీఎస్సీ విద్యార్థులు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ పాఠశాలల నుంచి సమాచారాన్ని సేకరిస్తారన్నారు. ఈ ప్రాజెక్టుల పర్యవేక్షణ బాధ్యతలు దక్కిన ఆర్థిక శాఖ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కేశవ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బ్రజరాజ్ మిశ్రాను వీసీతో పాటు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

వచ్చాడయ్యో స్వామి..



- ఊరూవాడా చవితి సంబరం
- వివిధ రూపాల్లో కొలువుదీరుతున్న గణనాథులు
- పండుగ కొనుగోళ్లతో మార్కెట్లు కిటకిట

అనంతపురం కల్చరల్ : హిందువులు ఏ కార్యం తలపెట్టినా నిర్విఘ్నంగా సాగాలంటే వినాయకుని అనుగ్రహం తప్పనిసరిగా ఉండాలని భావిస్తుంటారు. గణపతి పూజ అనంతరం వివిధ పూజా కార్యక్రమాలను వేదపండితులు నిర్వహిస్తుంటారు. అమ్మచేతిలో పసుపు ముద్దగా అవతరించి పసుపు గణపతిగా పూజలు అందుకుంటున్న ఆదిదేవుడైన గణపతి ఆవిర్భవించిన రోజే నేడు మనం జరుపుకుంటున్న వినాయక చవితి. పండుగ కోసం పూజాసామగ్రి వినాయక ప్రతిమల కొనుగోళ్లతో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అనంతపురంతో పాటు మండల కేంద్రాలు, పట్టణ ప్రాంతాలు కిటకిటలాడాయి. మామిడాకులు, చెరకు గడలు, వెలగకాయలు, పండ్లు, పూలు కొనుగోలు చేశారు. వివిధ రూపాల్లోని బొజ్జ గణపయ్యలు అనంతపురం, తాడిపత్రి, రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, శింగనమల, రాప్తాడు నియోజకవర్గాల్లో ఏర్పాటైన మంటపాల్లో కొలువుదీరాయి. ఇక ఇంట్లో పూజించేందుకు మార్కెట్లో వివిధ పరిమాణాల్లో లభించే రకరకాల గణపతి ప్రతిమలను తీసుకొచ్చారు.




అనంతపురం పాతవూరులో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్

కదిలే వినాయకులు

ఏటేటా వినాయక సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. కొలువుదీరిన వినాయకుల్లో కదిలే విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అనంతపురంలోని సప్తగిరి సర్కిల్ విద్యుద్దీపకాంతులతో భారీ దేవతారూపాల సెట్టింగులతో సుందరంగా ముస్తాబైంది. మొదటిరోడ్డు, రాణీనగర్, కమలానగర్, ప్రకాష్‌రోడ్డు తదితర చోట్ల కదిలే వినాయకులు పుణ్యక్షేత్రాల వృత్తాంతాలను ప్రదర్శించడానికి సిద్ధ మయ్యాయి.

నేడు ప్రత్యేక పూజలు

వినాయక చవితి సందర్భంగా శనివారం అనంతపురంలోని పాతూరు చెరువుకట్ట వినాయక ఆలయం, రైల్వేస్టేషన్ సమీపంలోని విఘ్నేశ్వరాలయం, కమ్మభవన్ ఎదురుగా ఉన్న శ్రీసిద్ధి వినాయక ఆలయం తదితర చోట్ల ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగనున్నాయి.



అనంతపురంలో వేడుకలకు సిద్ధమైన వినాయక చౌక్



భారీ విగ్రహం కొనుగోలు చేసి తీసుకెళ్తున్న యువకులు







అనంతపురం సుభాష్‌రోడ్డు, పాతవూరు ప్రాంతాల్లో శుక్రవారం పూజా సామగ్రి, గణపతి విగ్రహాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

ప్రత్యామ్నాయంపై రైతుల అనాసక్తి

- విత్తన సరఫరా, పంపిణీలో ఆలస్యమే ప్రధాన కారణం

అనంతపురం అగ్రికల్చర్: ఉలవ, పెసర, అలసంద, కొర్ర, సజ్జ, మినుము లాంటి ప్రత్యామ్నాయ విత్తనాలపై రైతులు ఆసక్తి చూపడం లేదు. 26 మండలాల పరిధిలో రిజిస్ట్రేషన్లు మొదలై నెల కావస్తున్నా... ఇప్పటి వరకూ 2,200 మంది రైతులు 785 క్వింటాళ్లకు మాత్రమే పేర్లు నమోదు చేసుకోవడమే ఇందుకు నిదర్శనం. విత్తన సరఫరా, పంపిణీ ప్రక్రియలో అంతులేని జాప్యం చోటు చేసుకుంటోంది. ఖరీఫ్‌లో ప్రధాన పంటల సాగుకు జూలై ఆఖరున గడువు ముగిసినా ఇప్పటికీ ప్రత్యామ్నాయ విత్తనాలు ఇవ్వకపోవడంతో రైతులు విసిగిపోయి పంట విరామం ప్రకటించినట్లుగా తెలుస్తోంది. ప్రధాన పంటల విత్తు గడువు ముగిసిన వారం లేదా పది రోజులకైనా ప్రత్యామ్నాయ విత్తనాలు అందుబాటులో పెట్టి ఉంటే విస్తీర్ణం గణనీయంగా పెరిగేదని కొందరు రైతులు అంటున్నారు. అయితే కూటమి సర్కారు, వ్యవసాయశాఖ ఆలస్యంగా స్పందించడంతో ప్రత్యామ్నాయ విత్తుకు రైతులు వెనుకాడుతున్నారు. కాగా, ఏపీ సీడ్స్ ద్వారా ఇప్పటి వరకూ 2,600 క్వింటాళ్ల ఉలవలు, 70 క్వింటాళ్ల అలసందలు, 62 క్వింటాళ్ల పెసలు, 18 క్వింటాళ్ల జొన్నలు, 8 క్వింటాళ్ల కొర్రలు సరఫరా చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే పంపిణీ మాత్రం మొదలు పెట్టకపోవడం విశేషం.



ఎన్‌ఎంఎంఎస్ గడువు పొడిగింపు

- ఈ నెల 17 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం

అనంతపురం ఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష దరఖాస్తుకు గడువు పొడిగించారు. వాస్తవానికి ఈ నెల ఐదో తేదీతోనే దరఖాస్తు గడువు ముగిసింది. తాజాగా ఈ నెల 17 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడాది డిసెంబరు 8న ఈ పరీక్ష ఉంటుంది. ఈ పరీక్షలో ప్రతిభ చాటిన 8వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి నుంచి వరసగా నాలుగేళ్లు ఏడాదికి రూ.12 వేలు చొప్పున రూ.48 వేలు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనం అందించనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే అవకాశం. జిల్లా విద్యాశాఖ అధికారుల అలసత్వం కారణంగా జిల్లాలో 20,500 మంది విద్యార్థులకు గాను నాలుగు రోజుల కిందట వరకు 260 మంది విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. పత్రికా ప్రకటనలకు పరిమితమైన అధికారులు క్షేత్రస్థాయిలో ప్రధానోపాధ్యాయులపై ఒత్తిళ్లు చేయలేదు. ప్రతిభగల పేద విద్యార్థులకు వరంలా ఉండే ఈ పథకం పట్ల గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవగాహన లేక ఎక్కువమంది దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. ఇంత మంచి కార్యక్రమంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తెలియజేయాల్సిన విద్యాశాఖ అధికారులు తూతూమంత్రంగా ప్రకటనలు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. ప్రత్యేక దృష్టి సారించి కనీసం ఈ పది రోజుల్లోనైనా వీలైనంత ఎక్కువమంది విద్యార్థులతో ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేయించేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని మోడల్ స్కూళ్లలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. కుటుంబ సంవత్సరాదాయం రూ.3.50 లక్షలలోపు ఉన్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో విద్యార్థి ఆధార్ కార్డ్‌లో ఉన్న విధంగానే విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు ఎలాంటి ధ్రువపత్రాలూ అవసరం లేదని, పరీక్ష రాసే సమయానికి అన్నీ సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 2023 డిసెంబర్‌లో పరీక్ష రాసి ఎంపికైన విద్యార్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా విద్యార్థుల ద్వారా ప్రధానోపాధ్యాయుల సమక్షంలో చేయాలని సూచించారు.

రసవత్తరం.. ఫలితం ఖాయం

- హోరాహోరీగా దులీప్ ట్రోఫీ మ్యాచ్
- 5 వికెట్లతో చెలరేగిన మనవ్ సుతార్
- ఇరు జట్లలో ముగ్గురు హాఫ్ సెంచరీలు

అనంతపురం: దులీప్ ట్రోఫీలో భాగంగా అనంత క్రీడాగ్రామం ప్రధాన స్టేడియంలో ఇండియా -సి, ఇండియా - డి జట్ల మధ్య రెండో రోజు శుక్రవారం జరిగిన మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఒకే రోజు ఇండియా-సి జట్టు మిడిలార్డర్ బ్యాటర్ ఇంద్రజిత్, ఇండియా-డి జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, పడిక్కల్ అర్ధసెంచరీలతో అలరించారు. ఇండియా -సి బౌలర్ మనవ్ సుతార్ ఐదు వికెట్లతో చెలరేగిపోయాడు. అభిమానుల కేరింతలతో స్టేడియం హోరెత్తింది. ఇరు జట్ల బౌలర్లు పోటాపోటీగా రాణిస్తున్నందున మూడో రోజు శనివారమే మ్యాచ్ ఫలితం తేలే అవకాశం కనిపిస్తోంది. శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఇండియా -డి జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 49 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది. ప్రస్తుతం ఇండియా-డి జట్టు 202 పరుగుల ఆధిక్యంతో కొనసాగుతోంది.

ఆదుకున్న ఇంద్రజిత్

ఓవర్‌నైట్ స్కోరు 91/4తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా-సి జట్టు 48.3 ఓవర్లలో 168 పరుగులకే ఆలౌట్ అయింది. రెండో రోజు 77 పరుగులు మాత్రమే చేసి మిగతా ఆరు వికెట్లను కోల్పోయింది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్ బాబా ఇంద్రజిత్ 149 బంతులు ఎదుర్కొని 9 ఫోర్లతో 72 పరుగులు చేశాడు. ఇండియా-డి బౌలర్లలో పేసర్ హర్షిత్ రాణా 4, అక్షర్ పటేల్ 2, సరాన్ష్ జైన్2, అర్షదీప్ సింగ్, ఆదిత్య థాక్రే చెరో వికెట్ తీశారు.

సుతార్ దెబ్బకు తడబడిన ఇండియా-డి

తొలి ఇన్నింగ్స్‌లో లాగే రెండో ఇన్నింగ్స్‌లోనూ ఇండియా-డి జట్టు తడబడింది. ఇండియా-సీ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మనవ్ సుతార్ 15 ఓవర్లలో 30 పరుగులిచ్చి పడిక్కల్, శ్రీకర్ భరత్, సరాన్ష్ జైన్, అర్షదీప్, రికీ భుయిలను పెవిలియన్‌కు పంపాడు. అతనికి తోడుగా పేసర్ వైశాక్ రెండు వికెట్లు తీసి రాణించాడు. దీంతో ఇండియా-డి ఆట ముగిసే సమయానికి 8 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది. క్రీజులో అక్షర్‌పటేల్ (11), హర్షిత్ రాణా (0) ఉన్నారు. శ్రేయస్ అయ్యర్, దేవదత్ పడిక్కల్ అర్ధ సెంచరీలతో జట్టుకు గౌరవ ప్రదమైన స్కోరు అందించే ప్రయత్నం చేసినా.. మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో భారీ స్కోరు చేయలేకపోయింది. శ్రేయస్ అయ్యర్ 44 బంతుల్లో 9 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 54 పరుగులు, పడిక్కల్ 70 బంతుల్లో 8 బౌండరీలతో 56 పరుగులు చేశారు. మరో బ్యాటర్ రికీ భుయి 44 (5 ఫోర్లు, ఒక సిక్సర్) పరుగులు చేశాడు.

గ్రౌండ్‌లోకి దూసుకెళ్లిన అభిమాని

రెండో రోజు ఆటలో ఓ అనూహ్య ఘటన చోటు చేసుకుంది. ఓ అభిమాని సెక్యూరిటీ కళ్లు గప్పి స్టేడియంలోకి దూసుకొచ్చాడు. పరుగెత్తుకుంటూ వచ్చిన సదరు అభిమాని.. మిడాన్‌లో ఫీల్డింగ్ చేస్తున్న భారత యువ ఓపెనర్, ఇండియా-సి జట్టు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు పాదాభివందనం చేశాడు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



ఇండియా -సి, ఇండియా - డి జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో రసవత్తర ఘట్టం



బంతి బౌండరీకి వెళ్లకుండా ఆపుతున్న ఫీల్డర్లు



యువత కేరింత..



మ్యాచ్ వీక్షిస్తున్న అభిమానులు



మనవ్ సుతార్ (5 వికెట్లు)



పడిక్కల్ (56 పరుగులు)



శ్రేయస్ అయ్యర్ (54 పరుగులు)

అభిమాన శిఖరం



క్రీడాగ్రామంలో జరుగుతున్న మ్యాచ్‌లో రెండో రోజు ఆట సందర్భంగా ఓ అభిమాని అందరినీ ఆకర్షించాడు. భారత స్టార్ క్రికెటర్ శిఖర్ ధావన్ వీరాభిమాని అయిన శంకర్ గీతా ధావన్ రూ.13 లక్షలు ఖర్చు పెట్టి తన శరీరంపై శిఖర్ ధావన్ ఫొటోలతో కూడిన టాటూలు వేయించుకున్నాడు. శిఖర్ ధావన్ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసినప్పటి నుంచి ఎప్పుడు సెంచరీ సాధించింది తదితర అన్ని వివరాలు టాటూలో పొందుపరిచాడు. ముష్టూరు గ్రామానికి చెందిన శంకర్ గీతా ధావన్.. శిఖర్ ధావన్ ఎక్కడకెళ్లి మ్యాచ్ ఆడినా అక్కడ ప్రత్యక్షమవుతాడు. విదేశాల్లో ఆడినా సరే అక్కడికి వెళ్లి మ్యాచ్ తిలకిస్తాడు. దీంతో మురిసిపోయిన శిఖర్ ధావన్ రూ.20 వేల విలువ చేసే తన చేతి గడియారాన్ని శంకర్ గీతా ధావన్‌కు బహుమానంగా ఇచ్చాడు.

'చాగల్లు'లో పూర్తిస్థాయి నీరు నింపేలా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

యాడికి: చాగల్లు రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో నీరు నింపేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్దపప్పూరు మండలంలో పర్యటించిన కలెక్టర్.. చాగల్లు రిజర్వాయర్‌ను అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నీటి సామర్థ్యం.. ఇన్‌ఫ్లో.. నిల్వ చేయడానికి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అధికారులతో ఆరా తీశారు. 1.5 టీఎంసీల సామర్థ్యం గల రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.9 టీఎంసీలు మాత్రమే నిల్వ చేశారు. మిగిలిన 0.6 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు ఉన్న అడ్డంకులను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రిజర్వాయర్‌లో ఏవైనా మరమ్మతులు చేయాల్సి ఉంటే వాటిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ ఎస్‌ఈ రాజశేఖర్, ఇరిగేషన్ ఈఈ రమణారెడ్డి, తహసీల్దార్ బాలాజి, ఎంపీడీఓ రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి



ఇల్లూరులో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ ఈబీదేవి

గార్లదిన్నె: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని వైద్య సిబ్బంది, పంచాయతీ అధికారులకు డీఎంహెచ్ఓ ఈబీదేవి సూచించారు. గార్లదిన్నె మండలం ఇల్లూరులో శుక్రవారం ఆమె పర్యటించారు. పంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించిన అనంతరం స్థానికులతో ఆమె మాట్లాడారు. ఇటీవల ఇల్లూరులో విషజ్వరాలు ప్రబలి తండ్రి, కొడుకు మరణించడం బాధాకరమన్నారు. గ్రామంలో డ్రైనేజీల్లో పూడికతీత పనులు, దోమల నివారణకు ఫాగింగ్, మురుగు నీటిలో దోమల లార్వాలు వృద్ధి చెందకుండా వేస్ట్ ఆయిల్ చల్లడం వంటి పనులు చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటింటికీ వెళ్లి జ్వరాల బారిన పడిన వారికి చికిత్స అందజేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఎక్కువ రోజులు జ్వరంతో బాధపడే వారి రక్త నమునాలు సేకరించి ల్యాబ్‌కు పంపి వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. కార్యక్రమం లో జిల్లా మలేరియా అధికారి ఓబులు, ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓఆర్డీ వెంకటలక్ష్మి, డాక్టర్ గౌతమి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



నాగార్జున (ఫైల్)

గార్లదిన్నె: విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన నాగార్జున (33) వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కూలీలతో కలసి తన తోటలో పనిచేస్తున్న ఆయన నీళ్ల కోసం మోటార్‌ను ఆన్ చేసేందుకు స్టార్టర్ పెట్టె తీస్తుండగా షాక్‌కు గురై కుప్పకూలాడు. కూలీల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని అపస్మారక స్థితిలో పడి ఉన్న నాగార్జునను వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. కాగా, నాగార్జునకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సౌరశక్తికి చంద్రగ్రహణం

- సోలార్ పార్క్ ఏర్పాటుపై కూటమి సర్కార్ నిర్లక్ష్య ధోరణి
- జగన్ హయాంలో శరవేగంగా భూ సేకరణ
- 4 వేల మెగావాట్ల సోలార్ పార్క్ ఏర్పాటుకు చర్యలు
- పనులు పూర్తయితే క్రెడిట్ వైఎస్ జగన్‌కు దక్కుతుందనే అక్కసు
- కలగా మిగలనున్న 'దుర్గం' ప్రజల ఆకాంక్ష



కళ్యాణదుర్గం: సోలార్ పార్క్ ఏర్పాటుతో తమ జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఆశించిన దుర్గం ప్రజల కల ఇప్పట్లో నెరవేరేలాలేదు. కేవలం వైఎస్ జగన్ హయాంలో ఈ ప్రాజెక్ట్‌కు అంకురార్పణ జరిగిందని, పూర్తయితే ఆ క్రెడిట్ మొత్తం వైఎస్ జగన్ ఖాతాలోకి చేరుతుందని భావించిన కూటమి సర్కార్ కుట్రపూరితంగా ప్రాజెక్ట్‌పై నిర్లక్ష్యం కనబరుస్తోందనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. 4వేల మెగా వాట్ల సోలార్ పార్క్‌ను పూర్తి చేయించడంపై సీఎం చంద్రబాబు ఇప్పటి వరకూ ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో పూర్తి సందిగ్ధత నెలకొంది.

22 వేల ఎకరాల భూసేకరణ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో ఏపీ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్, నెడ్‌క్యాప్ ద్వారా 4 వేల మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది. ఈ క్రమంలో ప్రాజెక్ట్ ఏర్పాటుకు అవసరమైన 22 వేల ఎకరాల భూమిని అప్పటి ప్రభుత్వం గుర్తించింది. పవర్ ప్లాంట్ వల్ల ఒనగూరే లబ్ధిపై రైతులను చైతన్య పరచడంతో ఎలాంటి ఆటంకాలు లేకుండా భూసేకరణ ప్రక్రియ పనులు పూర్తయ్యాయి. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 12 వేల ఎకరాలు, రాయదుర్గం నియోజకవర్గంలో 10 వేల ఎకరాల భూములను అప్పగించేందుకు రైతులు సైతం అంగీకారం తెలిపారు. ఈ లోపు ఎన్నికలు సమీపించడంలో అక్కడితో ఈ ప్రక్రియ ఆగింది. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ సోలార్ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాల్సిన బాధ్యతను విస్మరించింది.

30 ఏళ్ల లీజ్‌కు అగ్రిమెంట్

కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో సోలార్ ఎనర్జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు పలు కార్పొరేట్ కంపెనీలు ముందుకొచ్చాయి. గత ప్రభుత్వంలోనే కళ్యాణదుర్గం ప్రాంతంలో హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రా పవర్, టోరెంట్ పవర్, షిరిడీ సాయి పవర్ ప్రాజెక్టులతో పాటు రాయదుర్గం ప్రాంతంలో ఎన్‌టీపీసీ, ఆదానీ పవర్, టాటా వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు అధికారుల సమక్షంలో రైతులతో సమావేశమై చర్చలు ముగించారు. ఆయా కంపెనీలకు కేటాయించిన భూవిస్తీర్ణం మేరకు ఇప్పటికే కంపెనీ ప్రతినిధులు రైతులతో 30 ఏళ్ల లీజ్ అగ్రిమెంట్‌కు ఒప్పందం కుదుర్చుకున్నారు. నిర్వాసితులకు పరిహారం చెల్లించేలోపు ఎన్నికలు సమీపించాయి. దీంతో ఈ ప్రక్రియ ఒక్కటే నిలిచిపోయింది. ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు... ఇప్పటి వరకూ సోలార్ ప్లాంట్ ఏర్పాటు అంశంపై పెదవి విప్పలేదు. దీంతో సోలార్ ప్లాంట్ ఏర్పాటు అవుతుందో.. లేదో కూడా తెలియని అయోమయ పరిస్థితుల్లో రైతులు ఉన్నారు.

కుంటు పడిన గ్రామాల అభివృద్ధి

సోలార్ పార్క్‌లపై కూటమి ప్రభుత్వం ఊసెత్తకపోవడంతో ఆ ప్రభావం గ్రామాల అభివృద్ధిపై పడింది. సోలార్ పార్క్ ఏర్పాటుకు కేటాయించిన ఆయా గ్రామాల్లో కంపెనీలు పెట్టుబడుల్లో రెండు శాతం నిధులతో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకునేవారు. దీంతో గ్రామాల్లో సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతులు సమకూరేవి. భూములు కోల్పోయిన రైతుల ఇళ్లల్లో పిల్లల చదువును బట్టి ఉద్యోగాలు సైతం దక్కేవి. తద్వారా నిరుద్యోగ సమస్య తీరేది. అయితే ఈ క్రెడిట్ మొత్తం వైఎస్ జగన్ సర్కార్‌కు దక్కుతుందనే భావనతో సోలార్ పార్క్ ఏర్పాటు అంశాన్ని కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోందనే విమర్శలు వెల్లువెత్తాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 12 వేల ఎకరాలు, రాయదుర్గం నియోజకవర్గంలో 10 వేల ఎకరాల్లో సోలార్ పార్క్ ఏర్పాటుకు సన్నాహాలు జరిగినట్లుగా చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం మారింది. సోలార్ పార్క్ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. అప్పట్లో ఎంత మేర భూములు సేకరించారు. ప్రభుత్వం నుంచి ఏమైనా అనుమతులు వచ్చాయా? అనే అంశాలపై ఉన్నతాధికారులతో చర్చిస్తాం.

– డాక్టర్ రాణి సుస్మిత, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

వారి పరిస్థితి దారుణంగా ఉంది

- తాగునీటి పథకాల కార్మికుల దుస్థితిపై కలెక్టర్‌తో చర్చించిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి
- సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి



కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ఉరవకొండ: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకాల్లో పని చేస్తున్న వెయ్యికి పైగా కార్మికుల పరిస్థితి దారుణం ఉందని, జీతాలు అందక దుర్భర పరిస్థితుల్లో బతుకీడుస్తున్న వారి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఆయన కలసి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలంటూ కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరవధిక సమ్మెలోకి కార్మికులు వెళ్లారన్నారు. ఫలితంగా ఆరు నియోజకవర్గాల పరిధిలోని 910 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీలు సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని, పీఎఫ్ నిధులనూ పక్కదారి పట్టిస్తున్నాయని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోండి

పీఏబీఆర్ బ్యాక్ వాటర్ ప్రవాహం మీద హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి రూ.50 కోట్లతో చేసిన ప్రతిపాదనలకు గత ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, అయితే కూటమి ప్రభుత్వం ఈ ప్రక్రియపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధకరమని ఎమ్మెల్సీ అన్నారు. తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే కూడేరు మండల పరిధిలో రూ.82 కోట్లతో 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి వైఎస్ జగన్ సర్కార్ అనుమతులు జారీ చేసిందని, అయితే రెవెన్యూ శాఖ పరంగా ఐదెకరాల స్థలం కేటాయించి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ విజ్ఞప్తులు, సూచనలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. తాగునీటి పథకం కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటానని భరోసానిచ్చారు.

టీడీపీ కార్యకర్తల వేధింపులు తాళలేకనే వైదొలిగాం

- మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు



మాట్లాడుతున్న ఎండీఎం ఏజెన్సీ నిర్వాహకులు

శింగనమల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తమపై టీడీపీ కార్యకర్తల వేధింపులు ఎక్కువయ్యాయని, దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పాఠశాలల్లో మధ్యాహ్న భోజన (ఎండీఎం) ఏజెన్సీని వదులుకోవాల్సి వచ్చిందని నిర్వాహకులు గొల్ల వరలక్ష్మి, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం శింగనమల జెడ్పీహెచ్ఎస్‌లో విలేకరులతో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకూ శింగనమల జెడ్పీహెచ్ఎస్‌లో ఎండీఎంను తాము నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. అయితే రాష్ట్రంలో తమ ప్రభుత్వం ఉంది కాబట్టి ఎండీఎంలను తామే నిర్వహిస్తామంటూ నెల రోజులుగా టీడీపీ కార్యకర్తలు వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. గతంలో ఎమ్మెల్యేలుగా శైలజానాథ్, యామిని బాల, జొన్నలగడ్డ పద్మావతి ఉన్నా.. వారితో పాటు ఆయా పార్టీల నాయకులు కానీ, కార్యకర్తలు కాని తమపై ఎలాంటి ఒత్తిళ్లు చేయలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొందరు టీడీపీ కార్యకర్తలు రెచ్చిపోయి తమను వేధింపులకు గురి చేస్తూ వచ్చారని వాపోయారు. చివరకు శుక్రవారం వంట చేయడానికి వీలులేకుండా పాఠశాల వంట గదికి వేసిన తాళానికి ఎంసీలు పూసి తీయడానికి వీలులేకుండా పాడు చేశారన్నారు. ఏజెన్సీని వీడకపోతే వండిన ఆహార పదార్థాలను కలుషితం చేస్తామని బెదిరింపులకు దిగారన్నారు. దీంతో ఎండీఎం బాధ్యతల నుంచి తాము వైదొలుగుతున్నట్లు రాతపూర్వకంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి లేఖ అందజేశామన్నారు.

గృహ నిర్బంధం నుంచి రక్షించండి

- కలెక్టర్‌కు ఈ మెయిల్ ద్వారా ఓ ఇల్లాలి వినతి
- స్పందించిన కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం సిటీ: గృహ నిర్బంధంలో ఉన్న తనను రక్షించాలంటూ కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఈ మెయిల్ ద్వారా ఓ వివాహిత వేడుకుంది. దీనిపై కలెక్టర్ వినోద్‌కుమార్ తక్షణమే స్పందించారు. ఈ మెయిల్‌లోని సారాంశం మేరకు... అనంతపురంలోని టీడీడీ కల్యాణమంటం వద్ద ఉన్న ద్వారకా నగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న యువతి బీటెక్ పూర్తి చేసింది. అప్పటికే బీటెక్ పూర్తి చేసి, బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న మేనమామను పెళ్లి చేసుకోవాలని కుటుంబ సభ్యులు ఆమెను ఒత్తిడి పెట్టారు. ఆమె అంగీకరించకపోవడంతో బలవంతంగా ఆమెకు మేనమామతో పెళ్లి జరిపించారు. ఈ క్రమంలో వారికి మూడేళ్ల క్రితం ఓ కుమారుడు జన్మించాడు. తనకు మేనమామతో కాపురం చేయడం ఇష్టం లేదని తల్లిదండ్రులకు తెలపడంతో వారు మందలించారు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేస్తే కాపాడి నెల రోజులుగా తనను తల్లిదండ్రులే గృహ నిర్బంధంలో ఉంచారని, ఈ విషయంగా డయల్ 100కు కాల్ చేసి మొరపెట్టుకుంటే కానిస్టేబుళ్లు వచ్చిరాగానే వారిని కుటుంబసభ్యులు ప్రభావితం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేసింది. తన పెద్ద బావ పోలీస్ అధికారి కావడంతో కానిస్టేబుళ్లను ఆయన నియంత్రిస్తున్నట్లుగా ఆరోపించింది. బిడ్డ కోసమే బతుకుతున్న తనను ఎలాగైనా కాపాడాలని వేడుకుంది. దీనిపై స్పందించిన కలెక్టర్ వినోద్‌కుమార్ వెంటనే సమగ్ర విచారణ చేపట్టి బాధితురాలికి న్యాయం చేయాలని ఎస్పీ, ఐసీడీఎస్ పీడీని ఆదేశించారు. దీంతో రంగంలో దిగిన ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సఖి వన్‌స్టాప్ సెంటర్ మేనేజర్ శాంతామణి, మహిళా పోలీసులు బృందంగా ఏర్పడి బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్న డోర్ నంబర్‌కు వెళ్లి విచారణ చేపట్టారు. తొలుత అలాంటి వారెవరూ ఇక్కడ లేరంటూ బుకాయించినా... శుక్రవారం సాయంత్రానికి బాధితురాలిని అధికారులు కలుసుకున్నారు. ఆమె ఆవేదనను విన్నారు. ఘటనపై ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ... బాధితురాలి మాటలను బట్టి ఆమె పూర్తిగా డిప్రెషన్‌లో ఉన్నట్లు అర్థమవుతోందన్నారు. పెళ్లికి ముందు, తర్వాత జరిగిన ఘటనలే ఇందుకు కారణమన్నారు. వైద్యుల సూచన మేరకే తాము ఆమెను ఇంటికి పరిమితం చేశామని కుటుంబ సభ్యులు తమతో పేర్కొన్నారని, పండుగ తర్వాత మరోసారి బాధితురాలితో మాట్లాడి ఓనిర్ణయానికి వస్తామని తెలిపారు.

గర్భిణుల కోటాకు మళ్లీ కోత

- గత నెల మాదిరిగానే ఈ నెలలోనూ అందని పౌష్టికాహార సరుకులు

తాడిపత్రి రూరల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహార సరుకులపై కోత పడుతూనే ఉంది. గత నెల మూడు కిలోల చొప్పున బియ్యం ప్యాకెట్లు, వంట నూనె సరఫరా కాలేదు. ఈ నెల కూడా సరుకులు సరఫరా కాకపోవడంతో పౌష్టికాహారం ఎలా వండి పెట్టాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. తాడిపత్రి ప్రాజెక్టు పరిధిలో 302 అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంఎల్ఎస్ పరిధిలోని పుట్లూరు, యల్లనూరు మండలాల్లో 95 సెంటర్లు ఉన్నాయి. మొత్తం 3,400 మంది గర్భిణులు, బాలింతలు.. 4,400 మంది ప్రీ స్కూల్ పిల్లలు ఉన్నారు. తాడిపత్రి మున్సిపాలిటీతో పాటు రూరల్ పరిధిలో దాదాపు 1,800 మంది బాలింతలు, రెండు వేలకు పైగా ప్రీ స్కూల్ పిల్లలకు ప్రతి నెలా ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి పౌష్టికాహార సరుకులు అందజేస్తుంటారు. ఆగస్టులో స్టాక్ తక్కువగా వచ్చిందని సరుకులు సరఫరా చేయలేదు. ఈ నెలకు సంబంధించి తాడిపత్రి మునిసిపాలిటీతో పాటు మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ సరుకులు అందలేదు. ప్రతి నెలా మొదటి వారంలో పౌష్టికాహార సరుకులు తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు చేర్చాలనే నిబంధనను అధికారులు తుంగలో తొక్కారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ అంశంపై జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ రమేష్‌రెడ్డిని వివరణ కోరగా... తాడిపత్రి మునిసిపాలిటీతో పాటు మండలానికి బియ్యం ప్యాకెట్లు, నూనె ఎందుకు సరఫరా కాలేదో విచారణ చేస్తామన్నారు.

అప్పీళ్లను పరిష్కరించకుండానే సర్దుబాటా?

- ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు



మాట్లాడుతున్న నరసింహులు

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ల పని సర్దుబాటు అంశంపై ఇచ్చిన అప్పీళ్లను పరిష్కరించకుండానే డివిజన్ స్థాయి సర్దుబాటు ప్రక్రియ ఎలా చేపడతారంటూ విద్యాశాఖ అధికారులపై ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఏపీటీఎఫ్ అనంతపురం జోన్ సమావేశం జరిగింది. జిల్లా కార్యదర్శి ఎం.సతీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నరసింహులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన పని సర్దుబాటు ప్రక్రియలో వెలుగు చూసిన అనేక సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వాటిలో చాలా సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. సిరాజుద్దీన్ మాట్లాడుతూ... బయాలజీ అసిస్టెంట్‌ను ఇంగ్లిష్ అసిస్టెంట్‌గా, తెలుగు పండిట్ అసిస్టెంట్‌ను సోషల్ అసిస్టెంట్‌గా సర్దుబాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉర్దూ ఉన్నత పాఠశాలలో హిందీ సబ్జెక్టు లేకున్నా హిందీ ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారని, ఉర్దూ లేని చోట ఎస్ఏ ఉర్దూ టీచర్‌ను సర్దుబాటు చేశారని తెలిపారు. అప్పీళ్లను పరిష్కరించిన తర్వాతనే డివిజన్ స్థాయి సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్లు సర్దార్ వలి, వెంకటరమణ, జిల్లా ఆడిట్ కన్వీనర్ వన్నప్ప, నాయకులు గోరంట్ల శ్రీనివాసులు, తిప్పేస్వామి, బీకేఎస్ శ్రీనివాసులు, రామ్మూర్తి పాల్గొన్నారు.

ఫొటోలు ఇవ్వని స్టూడియో యజమానికి జరిమానా

అనంతపురం: పెళ్లి సమయంలో తీసిన ఫొటోలు, వీడియో ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిన స్టూడియో యజమానికి రూ.50 వేల జరిమానా విధిస్తూ జిల్లా వినియోగదారుల న్యాయస్థానం చైర్‌పర్సన్ ఎం.శ్రీలత శుక్రవారం తీర్పు వెలువరించారు. వివరాలు... అనంతపురానికి చెందిన శ్రీనివాసకుమార్ గత ఏడాది తన కుమారుడి వివాహ వేడుకకు సంబంధించి ఫొటోలు, వీడియో తీసేందుకు ఫొటోగ్రాఫర్ జయచంద్రతో రూ.85 వేలకు ఒప్పందం చేసుకున్నాడు. ఇందులో రూ.75 వేలను చెల్లించాడు. అయితే పెళ్లి ముగిసి నెలలు గడుస్తున్నా ఫొటోలు, వీడియో ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో శ్రీనివాసకుమార్ నిలదీశాడు. ఆ సమయంలో ఫొటోలు, వీడియో ఇవ్వడానికి కుదరదని, కావాలంటే డబ్బు తిరిగి ఇస్తానని జయచంద్ర తెలిపి, ఆ మొత్తం కూడా ఇవ్వకుండా మొండికేశాడు. దీంతో బాధితుడు జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. జయచంద్ర తీసుకున్న రూ.75 వేలను 24 శాతం వడ్డీతో సహా చెల్లించాలని, మానసిక వేదనకు గురి చేయడంతో పాటు సేవాలోపానికి గాను మరో లక్ష రూపాయల జరిమానా, కోర్టు ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు చెల్లించాలని పిటీషన్ దాఖలు చేశాడు. దీనికి సంబంధించిన నోటీసులు అందుకున్న స్టూడియో యజమాని కమిషన్ ఎదుట హాజరు కాకుండా ముఖం చాటేశాడు. దీనిపై పూర్వపరాలు విచారించిన అనంతరం ఫిర్యాది పేర్కొన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని రూ.75వేలను 9శాతం వడ్డీతో సహా చెల్లిచండంతో పాటు మానసిన వేదనకు గురి చేయడం, సేవాలోపానికి గాను రూ.50 వేలు జరిమానా, కోర్టు ఖర్చులకు మరో రూ.5 వేలు అంతా కలిపి 45 రోజుల్లోపు చెల్లించాలని జిల్లా వినియోగదారుల న్యాయస్థానం చైర్‌పర్సన్ ఎం శ్రీలత, సభ్యులు డి. గ్రేస్ మేరి, బి. గోపీనాథ్ ధర్మాసనం తీర్పు వెలువరించింది.

వ్యక్తి దుర్మరణం



మృతుడు లాలెప్ప

తాడిపత్రి రూరల్: ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం గద్దరగట్టుపల్లికి చెందిన లాలెప్ప (45), విష్ణువ్వరరెడ్డి శుక్రవారం ఉదయం వ్యక్తిగత పనిపై ద్విచక్ర వాహనంలో తాడిపత్రికి బయలుదేరారు. గ్రామ శివారులోకి చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన ట్రాక్టర్ ఢీకొనడంతో లాలెప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన విష్ణువ్వరరెడ్డిని స్థానికులు వెంటనే తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్, నంద్యాల జిల్లా అంకిరెడ్డిపల్లికి చెందిన నాగార్జున రాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివ గంగాధరరెడ్డి తెలిపారు.

పశుశాఖ ఏడీలకు పదోన్నతి బదిలీ



జేడీఏహెచ్ వెంకటస్వామి

అనంతపురం అగ్రికల్చర్: పశు సంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జీపీ వెంకటస్వామికి జేడీఏహెచ్‌గా పదోన్నతి కల్పిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన పెనుకొండ షీప్‌ఫారం డీడీగా పనిచేస్తూ ఇటీవల ఇన్‌చార్జి జేడీగా బాధ్యతలు తీసుకున్న విషయం తెలిసిందే. తాజా ఉత్తర్వులతో ఆయన పశుశాఖ రెగ్యులర్ జేడీగా పనిచేయనున్నారు. అలాగే అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా పని చేస్తున్న ఇరువురికి డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో ఉరవకొండ ఏరియా ఆసుపత్రి ఏడీ డాక్టర్ ఎం.కాంతమ్మకు డీడీగా పదోన్నతి ఇస్తూ పెనుకొండ షీప్ ఫారానికి బదిలీ చేశారు. అలాగే యల్లనూరు ఆసుపత్రి ఏడీ డాక్టర్ ఎస్.మల్లారెడ్డిని నెల్లూరు జిల్లా కావలి డీడీగా బదిలీ చేశారు. విజయనగరం జిల్లా తెర్లాంలో ఏడీగా ఉన్న డాక్టర్ కె.నాగరాజు... పెనుకొండ డీడీగా బదిలీ అయ్యారు. పెనుకొండ డీడీ డాక్టర్ సత్యప్రకాష్‌ను శ్రీకాకుళం జిల్లా డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా డిప్యుటేషన్ కింద బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు.

తెర వెనుక సూత్రధారి 'కాలవ'

- అక్రమాలకు అడ్డుపడతాననే నాపై ఆరోపణలు
- మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కాపు

అనంతపురం టవర్ క్లాక్: ఇటీవల తనని లక్ష్యంగా చేసుకుని ఇతరులు చేస్తున్న ఆరోపణల వెనుక అసలు సూత్రధారి రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అని మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం నియోజకవర్గ బీజేపీ నేత కాపు రామచంద్రారెడ్డి మండిపడ్డారు. అనంతపురంలోని ఓ రెస్టారెంట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయదుర్గంలో ఎమ్మెల్యే కాలవ సాగిస్తున్న అక్రమాలను అడ్డుకోవడం వల్లనే తనపై దుష్ప్రచారానికి తెరలేపారన్నారు. శ్రీమన్నారాయణ అనే వ్యక్తి ఎవరో కూడా తనకు తెలియదన్నారు. తనపై ఆరోపణలు చేసిన అనంతరం ఆయన గురించి ఆరా తీస్తే అసలు పేరు శివగా తెలిసిందన్నారు. ఆయన ఓ పెద్ద దగాకోరు అన్నారు. రాయదుర్గంలో ఐదేళ్లుగా ఎలాంటి అనుమతులు లేకుండా కంకర మిషన్ నడిపారన్నారు. గతంలో ఓ ఫ్యాక్టరీ పెట్టి ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ. 103 కోట్లను ఐపీ పెట్టి ఎగ్గొట్టాడన్నారు. తర్వాత అదే కంపెనీని తన కుమార్తె పేరుపై తెచ్చుకుని బ్యాంక్‌కు రూ.55 కోట్లు కుచ్చుటోపీ పెట్టాడన్నారు. అతనిపై మధ్యప్రదేశ్‌లో పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కర్ణాటకలోని గంగావతి వద్ద 300 ఎకరాల భూమిని కొనుగోలు చేశారన్నారు. గత గురువారం రూ.1.50 కోట్లు పెట్టి ఓ కారు కొనుగోలు చేశాడన్నారు. శ్రీమన్నారాయణ అక్రమాలపై ఇప్పటికే సీబీఐకి ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

మెడికల్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటైంది. అధ్యక్షుడిగా ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, సెక్రటరీగా డాక్టర్ రామస్వామినాయక్, కోశాధికారిగా డాక్టర్ మేడా ఆత్మారామ్, కో ట్రెజరర్‌గా డాక్టర్ మధుసూదన్, వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ నవీన్ కుమార్, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ హరికృష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ పద్మ శ్రావణి, డాక్టర్ హేమలత, డాక్టర్ పూర్ణచంద్ర శేఖర్, డాక్టర్ విజయకుమారి, డాక్టర్ వెంకట రమాబాయి, డాక్టర్ ఎస్ మాణిక్యరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. మాణిక్యరావు తెలిపారు.

రేపటి నుంచి యూటీఎఫ్ స్వర్ణోత్సవ క్రీడాపోటీలు

అనంతపురం ఎడ్యుకేషన్: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాల సందర్భంగా ఉపాధ్యాయులకు ఈ నెల 8 నుంచి జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో పురుషులకు క్రికెట్, వాలీబాల్ పోటీలు, అశోక్ నగర్ ఇండోర్ స్టేడియంలో మహిళలు, పురుషులకు షటిల్ బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ విభాగం పోటీలు, పురుషులకు బాస్కెట్‌బాల్ పోటీలు ఉంటాయి. అలాగే త్రోబాల్, టెన్నీకాయిట్, చెస్, క్యారమ్స్ నిర్వహణ తేదీలు తర్వాత సెలవు దినాల్లో నిర్వహించనున్నారు. 45 సంవత్సరాల లోపు, ఆపై బడిన వారు అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనవచ్చు.

ప్రమాదంలో యువకుడి మృతి



వెంకటరాముడు (ఫైల్)

అనంతపురం: నగరంలోని కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మృతుడిని పాపంపేటకు చెందిన వెంకటరాముడు(22)గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డులో పని ముగించుకుని రుద్రంపేట వైపు వెళుతుండగా ఒకేసారి కంటైనర్, ట్రాక్టర్ రావడంతో అదుపు తప్పి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. ఘటనపై ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

వరద బాధితులకు విరాళం



కలెక్టర్ వినోద్ కుమార్‌కు చెక్కు అందజేస్తున్న శ్రీసాయిరాం పాఠశాల కరస్పాండెంట్ మదన్‌మోహన్‌రెడ్డి

అనంతపురం అర్బన్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విద్యార్థులు విరాళం అందించడం అభినందనీయమని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. పెద్దపప్పూరులోని శ్రీ సాయిరాం ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు వరద బాధితుల సహాయార్థం రూ.30,159 సేకరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పాఠశాల కరస్పాండెంట్ మదన్ మోహన్‌రెడ్డి తదితరులు కలెక్టర్‌ను కలిసి విరాళం మొత్తాన్ని చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వరద బాధితులకు సహాయం అందించేందుకు విద్యార్థులు ముందుకు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మల్లీశ్వరి, ఇన్‌చార్జ్‌లు రామాంజనేయులు, గిరి, ఉపాధ్యాయులు భాస్కర్, అనంతయ్య, బాలాజీ, అంపయ్య, రమేష్, పీరా, బాషా పాల్గొన్నారు.

శింగనమల చెరువు పరిశీలన



శింగనమల చెరువు పాత మరువను పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంతబాబు, పోలీసులు

శింగనమల: అనంతపురంలోని వినాయక విగ్రహాలను శింగనమల చెరువులో నిమజ్జనం చేయడానికి అనుకూలతపై శుక్రవారం అనంతపురం ఆర్డీఓ వసంతబాబు, అనంతపురం డీఎస్పీ ప్రతాప్‌కుమార్ పరిశీలించారు. అనంతపురం నుంచి శింగనమల చెరువు వరకూ 20 కిలోమీటర్ల వరకు ఉంటుందని గుర్తించారు. చాలా దూరం అవుతుందని, నిమజ్జనానికి అనుకూలంగా ఉండదని భావించారు. వారి వెంట తహసీల్దార్ బ్రహ్మయ్య, సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి , పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న సమ్మె



నిరసన వ్యక్తం చేస్తున్న సత్యసాయి కార్మికులు

ఆత్మకూరు: తమ డిమాండ్లు నెరవేర్చి జీతాలు వెంటనే అందించాలని సత్యసాయి కార్మికులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆత్మకూరు సత్యసాయి నీటి సరఫరా కార్యాలయం వద్ద సమ్మె కొనసాగింది. తమ డిమాండ్ల నెరవేర్చే వరకు విధుల్లో చేరబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి కార్మికులు రమేష్ రెడ్డి, ఆంథోని రెడ్డి, శ్రీరాములు, ఓబన్న, శివ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రాప్తాడురూరల్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం అనంతపురం రూరల్ మండలం పాపంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం సరస్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ మాట్లాడుతూ.. రక్తహీనతను అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు శంకరమ్మ, సరస్వతి, ఆశా కార్యకర్తలు స్రవంతి, సునీత, ముజిత పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ



మహిళా రైతుకు విత్తనాల ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి: ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తున్న ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతులకు సబ్సిడీ ధరపై ఉలవలు, అలసంద విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీసీడ్స్ జిల్లా మేనేజర్ సుబ్బయ్య, వ్యవసాయాధికారి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణపయ్య పూజకు వేళాయె..

రాప్తాడు/ఆత్మకూరు/కనగానపల్లి: రాప్తాడు, అనంతపురం అర్బన్ నియోజకవర్గాల పరిధిలో వినాయక చవితికి సర్వం సిద్ధమైంది. ఆయా గ్రామాల్లో వినాయక విగ్రహాలను కొలువుదీర్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి మరిన్ని ఎక్కువగా విగ్రహాలు గ్రామాల్లో కనిపిస్తున్నాయి. ధర్మవరం, అనంతపురం పట్టణాల నుంచి వినాయక విగ్రహాలను ట్రాక్టర్లు, వ్యాన్లలో డప్పుచప్పుళ్ల మధ్య తీసుకొచ్చారు. ఆయా గ్రామాలు, కాలనీల్లో వినాయక మండపాలను ఇప్పటికే పచ్చతోరణాలు, విద్యుత్ కాంతులతో అందంగా ముస్తాబు చేశారు. శుక్రవారం చెరకు గడలు, బంతిపూలు, వెలక్కాయలు, గరక కొనుగోలుకు భక్తులు పోటీపడ్డారు. ఇక శనివారం ఉదయం పూజలు నిర్వహించిన అనంతరం వినాయక ప్రతిమలు మండపాల్లో కొలువుదీరనున్నాయి.



కనగానపల్లి: మామిళ్లపల్లి బీసీ కాలనీలో వినాయక మండపాన్ని ఏర్పాటు చేస్తున్న యువకులు



అనంతపురంలో ఆకట్టుకుంటున్న వినాయక ప్రతిమ



రాప్తాడు: ట్రాక్టర్‌లో వినాయకుడిని తరలిస్తున్న దృశ్యం



పాతూరులో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



ఆత్మకూరు: ప్రతిష్టించేందుకు సిద్ధంగా ఉన్న వినాయకుడి విగ్రహం

మట్టి గణపతులనే పూజిద్దాం

అనంతపురం కల్చరల్: పర్యావరణ హిత గణపతులనే పూజిద్దామని వైఎస్సార్‌సీపీ నాయకుడు అనంత చంద్రారెడ్డి అన్నారు. పర్యావరణ హితమే లక్ష్యంగా శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు అనిల్‌కుమార్ నేతృత్వంలో మట్టి గణపతుల పంపిణీ జరిగింది. స్థానిక మొదటి రోడ్డులో జరిగిన కార్యక్రమానికి అనంత చంద్రారెడ్డి, సామాజిక సేవాకార్యకర్త ఏజీ అనిల్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా వందలాది విగ్రహాలను వితరణ చేశారు. కార్యక్రమంలో చంద్రగౌడ్, రమణ, మహేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో 50వ డివిజన్ కార్పొరేటర్ శేఖరబాబు నేతృత్వంలో మట్టి గణపతులు అందించారు. హిమబిందు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాష్ట్రీయ స్వయం సేవక్ కార్యాలయమైన కోర్టు రోడ్డు శివకృపలో, సక్షం సంస్థ ఆధ్వర్యంలో స్థానిక విద్యారణ్య పాఠశాల ప్రాంగణంలో మట్టి గణపతుల పంపిణీ సాగింది.



వినాయక విగ్రహాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు అనంత చంద్రారెడ్డి

పర్యావరణ హితమే లక్ష్యం

అనంతపురం టౌన్/కల్చరల్: పర్యావరణ హితం అందరి లక్ష్యం కావాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఏపీ కాలుష్య నియంత్రణా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మునిసిల్ కార్యాలయం ఎదురుగా మట్టి వినాయకుల పంపిణీ జరిగింది. ఎంపీతో పాటూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర రెడ్డి, బీజేపీ లలిత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. మట్టి వినాయకులనే అందరూ పూజించాలని సూచించారు. అనంతరం ఆ శాఖ ఈఈ కిషోర్‌రెడ్డి చేతుల మీదుగా వందలాది మట్టి గణపతులను అందించారు. ఉదయం స్థానిక మొదటి రోడ్డు శారదా మునిసిపల్ బాలికల పాఠశాలలో చిన్నారులకు మట్టి గణపతుల తయారీ పోటీలు నిర్వహించారు. ప్రతిభా పాటవాలతో చిన్నారులు అందమైన విగ్రహాలను తయారు చేసి అధికారులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజారావు, డిస్కవరి అనిల్‌కుమార్ తదితరులు ఆత్మీయ అతిథులుగా చిన్నారుల సృజనను అభినందించి ప్రోత్సహించారు.

యువత దేశ ప్రగతికి వెన్నెముక

అనంతపురం కల్చరల్: యువత దేశ ప్రగతికి వెన్నెముక అని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం నెహ్రూ యువకేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ సేవా కార్యక్రమాలను యువకేంద్రం ద్వారా నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థల యువ ప్రతినిధులను ప్రత్యేకంగా ప్రశంసించారు. యువత అన్నింటిలోనూ ముందుండాలని సూచించారు. సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుని ప్రజా చైతన్యం దిశగా పని చేయాలన్నారు. ఉత్తమ నాయకులుగా ఎదగడానికి యువతకు ఎన్నో అవకాశాలున్నాయని తెలిపారు. వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. నిత్యం సాంస్కృతిక, క్రీడలు, శిక్షణ తరగతులు వంటి వాటిని సమర్థవంతంగా నిర్వహించి యువతను భాగస్వాములయ్యేలా చూడాలని అధికారులను సూచించారు. చైతన్యవంతమైన, ఆదర్శప్రాయమైన అనంతను తయారు చేయడమే లక్ష్యంగా యువత సాగాలన్నారు. గ్రీవెన్సులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారి సమస్యలు తెలుసుకుని అధికారుల ద్వారా పరిష్కారాన్ని చూపేందుకు యువత పని చేయాలని తెలిపారు. స్వచ్ఛందంగా పని చేయడానికి ముందుకు వచ్చే యువతకు ఉద్యోగ అవకాశాలు లభించేలా చూస్తామన్నారు. అనంతరం కలెక్టర్‌తో పాటూ ఎన్‌వైకే డీడీవో శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు భరత్, జీవన్‌కుమార్, జయమారుతి, రమేష్, విజయ్‌సాయి, యోగా గురువు మహేష్‌బాబు తదితరులు ఎన్‌వైకే ప్రాంగణంలో మొక్కలు నాటారు. మొక్కల పరిరక్షణ బాధ్యతలను యువ వలంటీర్లకు అప్పగించారు.



మొక్కకు నీరు పోస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

నీరు నిల్వ ఉండకుండా చూసుకోండి

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో నివాస ప్రాంతాల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. మండల పరిధిలోని ఎన్‌ఎస్‌గేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది శుక్రవారం న్యామద్దెల సచివాలయం-2 పరిధిలోని ప్రాంతాల్లోని పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి నీటి తొట్టిలో నిల్వ చేసిన నీటిని పరిశీలించారు. దోమల లార్వా ఉన్న నీటిని పారబోశారు. నీరు నిల్వ ఉంచడం ద్వారా దోమలు పెరిగి వ్యాధులు సోకే అవకాశం ఉందని తెలిపారు. దోమల ద్వారా వ్యాపించే డెంగీ, మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షపు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో అబేట్ మందు పిచికారీ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, సచివాలయ ఏఎన్‌ఎం అశ్విని, ఆశా వర్కర్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



న్యామద్దెలలో డ్రమ్ములో నిల్వ చేసిన నీటిని పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

ఘనంగా వినాయక చవితి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక అశోక్ నగర్‌లోని మినర్వా ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ముందస్తు వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగలో దాగివున్న ప్రకృతి ఆరాధనను తెలియజేశారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



బొజ్జ గణపయ్యకు పూజలు చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

చెన్నేకొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ సూచించారు. మండల పరిధిలోని కనుముక్కల గ్రామంలో శుక్రవారం ఎన్‌ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గర్భిణులకు రక్తహీనత పరీక్షలు చేసి, సూచనలు ఇచ్చారు. బీపీ, షుగర్‌తో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని డాక్టర్లు తెలిపారు. వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలన్నారు. దోమకాటుకు గురి కాకుండా దోమతెరలను తప్పక వాడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటనారాయణ, ఎమ్‌ఎల్‌పీ సౌందర్య, ఏఎన్‌ఎం సునీత, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, సరస్వతి, రాధిక, భాగ్యమ్మ, 104 సిబ్బంది సాయి కుమార్, గణేష్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



కనుముక్కలలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

పెరటి తోటల పెంపకం లాభదాయకం

బుక్కరాయసముద్రం: పెరటి తోటల పెంపకం లాభదాయకమని రేకులకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు సూచించారు. శుక్రవారం అఖిల భారత మెట్ట వ్యవసాయ పరిశోధనా స్థానం హైదరాబాద్, రేకులకుంట వ్యసాయ పరిశోధనా స్థానం సంయుక్తంగా నార్పల మండలంలోని నిలువరాయి గ్రామంలో రైతులకు పెరటి తోటల పెంపకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయనతోపాటు ఆక్సాం రీసెర్చ్ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీ కళ్యాణి పెరటి తోటల పెంపకం, యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించారు. అనంతరం రైతులకు పెరటి తోటల పెంపకం సంబంధించిన విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో మహేష్, చంద్ర, ప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు 'అనంత' టమాట

అనంతపురం అగ్రికల్చర్: విజయవాడ వరద బాధితులకు అనంతపురం సమీపంలో ఉన్న కక్కలపల్లి మండీ నుంచి 39 టన్నుల టమాట పంపించారు. ఈ మేరకు శుక్రవారం రెండు లారీల్లో 30 కిలోలు కలిగిన 1,300 బాక్సులు తరలించినట్లు రాప్తాడు మార్కెట్‌యార్డు సెక్రటరీ రామ్‌ప్రసాద్ తెలిపారు. మండీ మర్చంట్ అసోసియేషన్ సహకారంతో దాదాపు రూ.8 లక్షలు విలువ చేసే టమాటాలను వరద బాధితులకు సహాయార్థం విజయవాడకు పంపించినట్లు పేర్కొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లింపు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఉద్యోగ విరమణ పొందిన 12 మంది ఉద్యోగులకు దక్కాల్సిన బెనిఫిట్స్‌ను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు శుక్రవారం అందజేశారు. మొత్తం రూ.4.13 కోట్లను రిటైర్డ్ ఉద్యోగులకు అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వీసీకి రిటైర్డ్ ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

చెన్నేకొత్తపల్లి: మేడాపురం గ్రామ సమీపంలోని తూర్పు బావుల వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం విద్యా సామగ్రి పంపిణీ చేశారు. చిన్న వెంకటేష్ కుమార్తె అనిత ఇదే పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించింది. ప్రస్తుతం అనిత బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తాను చదువుకున్న పాఠశాల విద్యార్థులకు సాయం అందించాలని భావించి పాఠశాలలోని 53 మంది విద్యార్థులకు పలకలు, నోట్‌బుక్స్, టేబుల్స్, పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గురుమూర్తి ఉపాధ్యాయులు వెంకటరంగారెడ్డి, సుదర్శన రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో గౌరీ నోములు

అనంతపురం కల్చరల్: వినాయక చవితి పర్వదినానికి ముందు వచ్చే గౌరీ నోములు, వ్రతాలు శుక్రవారం సాయంత్రం కన్నుల పండువగా జరిగాయి. పలుచోట్ల మహిళలు సామూహిక వ్రతాలను ఆచరించారు. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో గురుశేఖర బాబు నేతృత్వంలో అమ్మవారి వ్రతాలు, ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. అర్చకులు గౌరీ వ్రతాల విశిష్టతను తెలియజేశారు.

మట్టి వినాయకుల పంపిణీ..

గౌరీ నోముల సందర్భంగా సాయిట్రస్టు వారు మట్టి వినాయక ప్రతిమలను జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌కు అందించారు. మట్టి గణపతులను ఉచితంగా అందిస్తున్న ట్రస్టు ప్రతినిధులను అభినందించారు. విజయ్‌సాయి, రాఘవేంద్ర, నారాయణ పాల్గొన్నారు. హౌసింగ్ బోర్డులో శ్రీసాయి అప్నా డ్రైవింగ్ స్కూల్ యజమాని వర్ధిరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మట్టి గణపతుల వితరణ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి ఆత్మీయ అతిథిగా విచ్చేసి పర్యావరణ హితం గురించి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్‌కుమార్, విజయవర్ధన రెడ్డి, రాజారెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వేణుగోపాల నగర్‌లో వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణమూర్తి నేతృత్వంలో మట్టి వినాయకుల పంపిణీ సాగింది. సీఐ నగేష్ పాల్గొన్నారు. అలాగే విద్యుత్ నగర్‌లోని శ్రీసాయి విఘ్నేష్ మెడికల్ స్టోర్ రమేష్ జ్యోతి ఆధ్వర్యంలో వందల మట్టి వినాయకులను పంపిణీ చేశారు.



వ్రతం ఆచరిస్తున్న మహిళలు

'మా భూమిని కబ్జా చేస్తున్నారు'



మాట్లాడుతున్న పోలా ప్రసాద్

అనంతపురం టవర్‌క్లాక్: రాప్తాడు మండలం గంగలకుంట గ్రామానికి చెందిన 43 ఎకరాల మా తాతల ఆస్తిని టీడీపీకి చెందిన సుధాకర్ నాయుడు అనే వ్యక్తి కబ్జా చేస్తున్నాడు. అతడి నుంచి భూమిని కాపాడాలని బాధితుడు పోలా ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గంగుల కుంట గ్రామంలో సర్వే నంబర్లు 4-01, 6-03, 4-22లో మొత్తం 43 ఎకరాల పొలం ఉందన్నారు. ఇప్పటికే ఆ స్థలం కోర్టులో కూడా ఉందని తెలిపారు. అయితే కొంతమంది దౌర్జన్యంగా బెదిరించి భూమిలోకి వస్తున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రసాద్ కోరారు.

చిన్నారులకు 'అమ్మ' చేయూత



చిన్నారులకు ఆర్థికసాయమందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: ఎవరు కష్టాల్లో ఉన్నా వెంటనే స్పందించి ఆదుకునే 'అమ్మ' సంస్థ అధినేత తరిమెల రమణారెడ్డి మరోసారి మానవత్వం చాటుకున్నారు. అనంతపురం రూరల్‌మండలం కేకే కాలనీ పంచాయతీ సీఎస్ పురంలో ఇటీవల నాగజ్యోతి అనే మహిళ హఠాన్మరణం చెందింది. ఆరవ తరగతి, తొమ్మిదవ తరగతి చదువుతున్న ఆమె ఇద్దరు పిల్లలు ఇబ్బందుల్లో ఉన్న విషయం తెలుసుకున్న రమణారెడ్డి శుక్రవారం వారి ఇంటికెళ్లి రూ.20 వేల ఆర్థికసాయం, మరో రూ.10 వేలు విలువ చేసే నిత్యావసర సరుకులు పంపిణీ చేసి చేయూతనందించారు. పిల్లలిద్దరికీ భవిష్యత్తులోనూ 'అమ్మ' సంస్థ అండగా నిలుస్తుందని భరోసానిచ్చారు.

గేదెకు సిజేరియన్



గేదె ప్రాణాలను కాపాడిన పశువైద్య బృందం

అనంతపురం అగ్రికల్చర్: ప్రాణాపాయంలో ఉన్న గేదెకు సిజేరియన్ చేసి రక్షించారు పశువైద్య బృందం. కళ్యాణదుర్గం మండలం కొత్తూరు గ్రామంలో తిప్పేస్వామికి చెందిన గేదె ఈనలేక మూడు రోజులుగా తీవ్ర ఇబ్బంది పడుతోంది. ఈ నేపథ్యంలో స్థానిక పశుశాఖ ఏడీ డాక్టర్ శ్రీనివాసగుప్తాను రైతులు సంప్రదించారు. గేదెను పరీక్షించిన ఏడీ లోపల దూడ అడ్డం తిరిగడంతో ఈనలేక పోతోందన్నారు. శస్త్రచికిత్స తప్పదని భావించి శింగనమల పశుశాఖ ఏడీ డాక్టర్ పద్మనాభంకు సిఫారసు చేశారు. గురువారం రాత్రి 1962 వాహనంలో గేదెను అనంతపురం పశువుల ఆస్పత్రికి తీసుకువచ్చి పరీక్షించారు. డాక్టర్ పద్మనాభంతో పాటు డాక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, డాక్టర్ సునీత, డాక్టర్ సురేంద్ర, హెల్పర్స్ ప్రవీణ్, శివ, రాజశేఖర్, జమ్మన్న, కమలాకర్, గీత తదితరులు దాదాపు గంట పాటు శస్త్రచికిత్స చేశారు. గర్భం మెలి తిరిగి ఉండటంతో రక్తప్రసరణ లేక లోపలే దూడ చనిపోయి, కుళ్లిపోయి, దుర్గంధమైందన్నారు. గర్భాశయం కూడా కుళ్లిపోవడంతో ఈనడానికి ఇబ్బంది కలిగిందన్నారు. శస్త్రచికిత్సతో చనిపోయిన దూడను బయటకు తీసి గేదె ప్రాణాలను కాపాడిన వైద్య బృందానికి రైతు తిప్పేస్వామి ధన్యవాదాలు తెలిపారు. తల్లి గేదెకు కావాల్సిన యాంటీబయాటిక్స్, పెయిన్‌కిల్లర్స్, ఫ్లూయిడ్స్ ఉచితంగా అందించారు. రాత్రి 11 గంటలకు 1962 వాహనంలో గ్రామానికి చేర్చారు.

సాక్షి బిజినెస్
శనివారం
7-9-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
1,017	293
81,184	24,852

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,709	▽ 418
డోజోన్స్	40,402	▽ 362
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,181	▽ 60
డాక్స్	18,302	▽ 275
షాంఘై	2,766	▽ 23
నికాయ్	36,657	▽ 266

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	71,329 △ 233
బంగారం (99.5 స్వచ్ఛత)	71,047 △ 235
వెండి (కేజీ)	81,406 △ 567

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	83.57	84.59
£	బ్రిటన్ పౌండ్	109.25	118.86
€	యూరో	91.95	94.34
¥	జపాన్ ఎన్ (100)	57.81	59.13
AU$	ఆస్ట్రేలియా డాలర్	55.56	57.52
S$	సింగపూర్ డాలర్	62.23	66.94
SAR	సౌదీ రియాల్	21.50	23.05
UAE D	యూఏఈ దిర్హామ్	21.98	23.76
¥	చైనా యువాన్	10.97	12.79

సెప్టెంబర్ మాసం...

ఐపీఓల వర్షం!

ఈ నెలలో 15కు పైగా పబ్లిక్ ఇష్యూలు ● 2010 నాటి 14 ఏళ్ల రికార్డు బ్రేక్ అయ్యే చాన్స్...



స్టాక్ మార్కెట్ జోరు నేపథ్యంలో పబ్లిక్ ఆఫర్లు (ఐపీఓ) వెల్లువెత్తుతున్నాయి. సెప్టెంబర్ నెలలో ఇష్యూల వర్షం కురవనుంది. 2010 సెప్టెంబర్‌లో అత్యధికంగా 15 ఐపీఓలతో రికార్డు నమోదైంది. ప్రస్తుతం ప్రైమరీ మార్కెట్లో జోరు చూస్తుంటే ఈ ఏడాది ఆ 14 ఏళ్ల రికార్డు బద్దలయ్యే అవకాశం కనిపిస్తోంది.

వరుస ఐపీఓలతో సెప్టెంబర్ నెలలో స్టాక్ మార్కెట్ కళకళలాడనుంది. ఇప్పటికే గాలా ప్రెసిషన్ ఇంజనీరింగ్, బాజార్ స్టయిల్ రిటైల్ ఇష్యూలు పూర్తయ్యాయి. ఇంకా అనేక ఇష్యూలు నిధుల సమీకరణ బాటలో ఉన్నాయి. బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్‌తో పాటు నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్, గరుడా కన్‌స్ట్రక్షన్స్, మన్బా ఫైనాన్స్ సహా అనేక కంపెనీలు పబ్లిక్ ఇష్యూల మోత మోగించనున్నాయి. దీంతో 2010 సెప్టెంబర్ నెల 15 ఐపీఓల రికార్డు తుడిచిపెట్టుకుపోవచ్చనేది మార్కెట్ వర్గాల అంచనా. ఇన్వెస్టర్ల నుంచి పటిష్టమైన డిమాండ్‌కు సెకండరీ మార్కెట్లో నెలకొన్న ఉత్సాహం తోడవడంతో మరిన్ని కంపెనీలు ఐపీఓల బాట పట్టేందుకు దోహదం చేస్తోందని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు చెబుతున్నారు. 'వచ్చే కొన్ని వారాల్లో చాలా కంపెనీలు పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో ఉన్నాయి. ఇటీవలి ఐపీఓలకు బలమైన డిమాండ్‌తో పాటు దేశీయ, విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి నిధుల ప్రవాహం తగినంతగా ఉండటం కూడా దీనికి ప్రధాన కారణం'. మరోపక్క తాజా ఇష్యూలు లిస్టింగ్‌లోనూ, ఆ తర్వాత కూడా ఇన్వెస్టర్లకు మంచి లాభాలు పంచడం మార్కెట్లో మరింత జోష్ నింపుతోంది' అని కోటక్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ ఎండీ వి. జయశంకర్ పేర్కొన్నారు.

విదేశీ పోర్ట్‌ఫోలియో నిధుల వెల్లువ...

ఈ ఏడాది ఇప్పటిదాకా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) రూ.55,300 కోట్ల నిధులను ఐపీఓల్లో కుమ్మరించారు. మరోపక్క, సెకండరీ మార్కెట్లో రూ.2,700 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. రూ. 6,560 కోట్ల బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ భారీ ఇష్యూ 9న మొదలవుతోంది. దీని ప్రైస్ బ్యాండ్ రూ.66-70. టోలిన్స్ టైర్స్ రూ.230 కోట్ల నిధుల కోసం 9న మార్కెట్ తలుపుతడుతోంది. ఇక పీఎస్ గాడ్గిల్ జ్యువెల్లర్స్ రూ.228-240 ధరల శ్రేణితో ఈ నెల 10న ఐపీఓకు వస్తోంది. గతేడాది సెప్టెంబర్లో వచ్చిన రూ.11,893 కోట్ల విలువైన 14 ఐపీఓలే ఇటీవలి కాలంలో అత్యధికంగా నిలుస్తున్నాయి. 2024 ఆగస్ట్‌లో 10 కంపెనీలు రూ.17,076 కోట్ల నిధులను సమీకరించాయి. 'మెరుగైన వ్యాపారావకాశాల నేపథ్యంలో భారత కార్పొరేట్ సంస్థలు ప్లాంట్ల విస్తరణతో పాటు కంపెనీల కొనుగోళ్ల జోరు పెంచాయి. మరో పక్క, పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు ఆడిట్ చేసిన ఆర్థిక ఫలితాల గడువు ఆరు నెలలు మాత్రమే. ఈ ఆర్థిక సంవత్సరంలో ఆర్నెల్ల గడువు సెప్టెంబర్‌తో ముగియనుంది. ఈలోపు ఐపీఓ పూర్తి చేయకపోతే, మళ్లీ ఆడిట్ చేయడంతో పాటు ఐపీవో ముసాయిదా దరఖాస్తు పత్రాలను మార్చాల్సి ఉంటుంది. దీని వల్ల ఇష్యూ జాప్యానికి దారితీస్తుంది. అందుకే కంపెనీలు వరుసకడుతున్నాయి' అని ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ రవి శంకర్ చెప్పారు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఎగబడుతున్న ఇన్వెస్టర్లు..


లిస్టింగ్‌లో అసాధారణ లాభాలిస్తుండటంతో ఇటీవలి కాలంలో మార్కెట్లోకి ఏ ఐపీఓ వచ్చినా రిటైల్ ఇన్వెస్టర్లు ఎగబడిపోతున్నారు. ఈ నెల 4న ముగిసిన రూ.168 కోట్ల గాలా ప్రెసిషన్ ఇష్యూ 201 రెట్లు అధికంగా సబ్‌స్క్రయిబ్ అయింది. బాజార్ స్టయిల్‌కు 41 రెట్ల స్పందన లభించింది. అంతక్రితం ఎకోస్ మొబిలిటీకి 64 రెట్లు సబ్‌స్క్రిప్షన్ లభించింది. అంతేకాదు, ఇది 32 శాతం ప్రీమియంతో లిస్టయింది కూడా. ప్రీమియర్ ఎనర్జీస్ 87 శాతం, ఓరియంట్ టెక్నాలజీస్ 48 శాతం చొప్పున లిస్టింగ్ లాభాలను పంచాయి. ఆగస్ట్‌లో లిస్టయిన 8 ఐపీఓల సగటు లాభం 36 శాతం కావడం గమనార్హం.

క్యూలో ఉన్న ఐపీఓలు...

కంపెనీ	సమీకరణ (రూ. కోట్లలో)
ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రా	7,000
బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్	6,560
నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్	3,000
పీఎన్ గాడ్గిల్ జ్యువెలర్స్	1,100
క్రాస్ లిమిటెడ్	500
వెస్టర్న్ క్యారియర్స్	*500
నార్తర్న్ ఆర్క్	*500
ఆర్కేడ్ డెవలపర్స్	430
శివాలిక్ ఇంజనీరింగ్	*335
టోలిన్స్ టైర్స్	230
శ్రీ తిరుపతి బాలాజీ ఆగ్రో	170
డిఫ్యూజన్ ఇంజనీర్స్	150

* ఆఫర్ ఫర్ సేల్ అదనం.

డీమ్యాట్ ఖాతాలు రయ్.. రయ్!



మార్కెట్ రికార్డులు, ఐపీఓల వరదతో కొత్తగా ఇన్వెస్ట్ చేసే వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఆగస్ట్‌లో 41.4 లక్షల డీమ్యాట్ ఖాతాలు జత కావడంతో మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య 17.1 కోట్లకు దూసుకెళ్లింది. ఇది ఆల్‌టైమ్ రికార్డు.

ఈవీ రంగంలోకి

రిలయన్స్ ఇన్‌ఫ్రా

కన్సల్టెంట్‌గా బీవైడీ మాజీ చీఫ్ సంజయ్ నియామకం



న్యూఢిల్లీ: అనిల్ అంబానీ గ్రూప్‌నకు చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తాజాగా ఎలక్ట్రిక్ కార్లు (ఈవీ), బ్యాటరీల తయారీ విభాగంలోకి ప్రవేశించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రణాళికలకు సంబంధించి వ్యయాలపరంగా సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసేందుకు చైనా దిగ్గజం బీవైడీ ఇండియా మాజీ హెడ్ సంజయ్ గోపాలకృష్ణన్‌ను కన్సల్టెంటుగా నియమించుకున్నట్లు సమాచారం. రిలయన్స్ ఇన్‌ఫ్రా ప్రాథమికంగా ఏటా 2,50,000 ఈవీలతో మొదలుపెట్టి 7,50,000 వాహనాలకు ఉత్పత్తిని పెంచుకోవాలని యోచిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే 10 గిగావాట్ అవర్స్ (జీడబ్ల్యూహెచ్) సామర్థ్యంతో బ్యాటరీల తయారీ ప్లాంటు ఏర్పాటు సాధ్యాసాధ్యాలను కూడా పరిశీలిస్తున్నట్లు వివరించాయి. ప్రభుత్వ రికార్డుల ప్రకారం రిలయన్స్ ఇన్‌ఫ్రా జూన్‌లోనే వాహన రంగానికి సంబంధించి కొత్తగా రెండు అనుబంధ సంస్థలను ప్రారంభించింది. రిలయన్స్ ఈవీ ప్రైవేట్ లిమిటెడ్ వీటిలో ఒకటి. అధిక రుణభారం, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న కంపెనీ ఈ కొత్త ఈవీ ప్రాజెక్టులకు నిధులెలా సమకూర్చుకుంటుందనే దానిపై ఇంకా స్పష్టత లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

బ్యాంకుల్లో అప్రెంటిస్‌లుగా గ్రాడ్యుయేట్లకు చాన్స్!	వొడాఫోన్‌కు గోల్డ్‌మన్ శాక్స్ షాక్

రెండు వారాల కనిష్టానికి సెన్సెక్స్

- 24,900 స్థాయి దిగువకు నిఫ్టీ
- అంతర్జాతీయ ప్రతికూలతల ప్రభావం



ముంబై: అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని బలహీనతలకు తోడు దేశీయ మార్కెట్లో విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల ఉపసంహరణతో శుక్రవారం స్టాక్ సూచీలు ఒకశాతానికి పైగా నష్టపోయాయి. సెన్సెక్స్ రెండు వారాల కనిష్టానికి చేరుకోగా.., నిఫ్టీ 24,900 స్థాయిని కోల్పోయింది. ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు క్రమంగా నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ 82,171 వద్ద, నిఫ్టీ 25,094 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. ఇంట్రాడేలో అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ఒక దశలో సెన్సెక్స్ 1,219 పాయింట్లు క్షీణించి 80,981 వద్ద, నిఫ్టీ 344 పాయింట్లు కుప్పకూలి 24801 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. చివరికి సెన్సెక్స్ 1,017 పాయింట్లు నష్టపోయి 81,184 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 293 పాయింట్లు పతనమై 24,852 వద్ద నిలిచింది.

నష్టాలు ఎందుకంటే...

ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లను ప్రభావితం చేసే నిరుద్యోగ రేటు, నాన్‌ఫారం పేరోల్స్ డేటా వెల్లడి (శుక్రవారం రాత్రి)కి ముందు నెలకొన్న అప్రమత్తతతో అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మూడు వారాల కనిష్ఠ స్థాయి వద్ద ట్రేడవుతున్నాయి. ఈ ప్రతికూల ప్రభావం మన మార్కెట్లపైనా పడింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు తమ అంతిమ లబ్ధిదారుల వివరాలు తెలిపేందుకు సెబీ తుది గడువు సెప్టెంబర్ 9న కావడంతో దేశీయ మార్కెట్లో ఎఫ్ఐఐలు అమ్మకాలకు పాల్పడుతున్నారు.

- ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈఈల లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ శుక్రవారం ఒక్కరోజే రూ.5.49 లక్షల కోట్లు హరించుకుపోయాయి. దీంతో బీఎస్ఈలో మార్కెట్ విలువ రూ.460.18 లక్షల కోట్లు దిగివచ్చింది.
- బజార్ స్టైల్ రిటైల్ లిస్టింగ్ రోజు నామమాత్రపు లాభాలు పంచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర రూ.389 వద్ద లిస్టయ్యింది. నష్టాల మార్కెట్లోనూ ఎదురీదడంతో షేరు ఇంట్రాడేలో 11% పెరిగి రూ.431 వద్ద గరిష్టాన్ని తాకింది. చివర్లో లాభాల స్వీకరణతో 3% స్వల్ప లాభంతో రూ.400 వద్ద నిలిచింది.

స్విగ్గీలో 'సీక్రెట్' ఆర్డర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆన్‌లైన్ ఫుడ్ ఆర్డరింగ్, డెలివరీ కంపెనీ స్విగ్గీ పరిశ్రమలో తొలిసారిగా వినూత్న ఫీచర్‌ను పరిచయం చేసింది. ఫుడ్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో ఇన్‌కాగ్నిటో మోడ్ ద్వారా వినియోగదార్లు ప్రైవేటుగా ఆర్డర్ చేయవచ్చు. అంటే ఆర్డర్ వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంటాయి. ఇన్‌కాగ్నిటో మోడ్ యాక్టివేట్ చేస్తే చాలు. యాప్ హిస్టరీలో ఆర్డర్ వివరాలు ఎక్కడా కనిపించవు. ఆర్డర్ వివరాలను మాన్యువల్‌గా డిలీట్ చేసే అవసరం లేదని కంపెనీ చెబుతోంది. ఆర్డర్ తాలూకు ఉత్పత్తులు డెలివరీ అయ్యాక ఏవైనా సమస్యలు ఉంటే మూడు గంటలపాటు ట్రాక్ చేసేందుకు వీలు ఉంటుంది.

గాడ్‌ఫ్రే ఫిలిప్స్‌కు బోనస్ జోష్

2:1 నిష్పత్తిలో షేర్ల జారీకి సై

న్యూఢిల్లీ: సిగరెట్ల తయారీ దిగ్గజం గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా తాజాగా వాటాదారులకు బోనస్ షేర్లను ప్రకటించింది. 2:1 నిష్పత్తిలో షేర్ల జారీకి ప్రతిపాదించింది. ఈ అంశాన్ని పరిశీలించేందుకు కంపెనీ బోర్డు సెప్టెంబర్ 20న సమావేశంకానున్నట్లు వెల్లడించింది. వెరసి వాటాదారులకు తమవద్దగల ప్రతీ 1 షేరుకి 2 షేర్లను ఉచితంగా జారీ చేయనుంది.

గాడ్‌ఫ్రే ఫిలిప్స్ షేరు 13 శాతం దూసుకెళ్లి రూ. 7,204 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్



ఇంటర్‌కాంటినెంటల్ కప్: సిరియా ఘనవిజయం

సాక్షి, హైదరాబాద్: ఇంటర్‌కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో సిరియా 2-0తో మారిషస్‌పై ఘన విజయం సాధించింది. ఈ పరాజయంతో మారిషస్ టోర్నమెంట్ నుంచి ఎలిమినేట్ కాగా... సోమవారం జరిగే ఆఖరి పోరులో ఆతిథ్య భారత్‌తో సిరియా తలపడుతుంది. జీఎంసీ బాలయోగి స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సిరియా ఫుట్‌బాలర్లు ఆరంభం నుంచే మ్యాచ్‌పై పట్టు సంపాదించారు. పదేపదే ప్రత్యర్థి గోల్ పోస్ట్ లక్ష్యంగా దాడులకు పదునుపెట్టారు. కానీ ప్రత్యర్థి డిఫెండర్ బ్రెండన్ సిటొరా చేసిన తప్పిదంతో సిరియా ఖాతా తెరిచింది. ఆట 32వ నిమిషంలో సిటొరా సెల్ఫ్‌గోల్‌తో సిరియా 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. తర్వాత రెండో అర్ధభాగంలో అల్ మవాస్ (70వ నిమిషంలో) సాధించిన గోల్‌తో సిరియా ఆధిక్యం (2-0) రెట్టింపైంది. మరోవైపు మారిషస్ కూడా రెండో సగంలో గోల్ కోసం చేసిన ప్రయత్నాల్ని సిరియా డిఫెండర్లు సమర్థంగా అడ్డుకున్నారు.

ప్రవీణ్ 'పసిడి' వెలుగులు

హైజంప్‌లో స్వర్ణం సాధించిన అథ్లెట్

- భారత్ ఖాతాలో ఆరో స్వర్ణం
- పారిస్ పారాలింపిక్స్ క్రీడలు



ప్రవీణ్

టోక్యోలో జరిగిన గత పారాలింపిక్స్ క్రీడల్లో భారత ఆటగాళ్లు ఐదు స్వర్ణాలు సాధించారు. ఇప్పుడు దానిని మన బృందం అధిగమించింది. 21 ఏళ్ల భారత అథ్లెట్ ప్రవీణ్ కుమార్ దేశానికి ఆరో పసిడి పతకాన్ని అందించాడు. హైజంప్‌లో అతను ఈ మెడల్‌ను గెలుచుకున్నాడు. శుక్రవారం జరిగిన పోటీల్లో భారత్‌కు స్వర్ణానందం దక్కగా.. ఇతర ఈవెంట్లలో మాత్రం నిరాశాజనక ఫలితాలు ఎదురయ్యాయి.

పారిస్: మూడేళ్ల క్రితం టోక్యో ఒలింపిక్స్‌లో రజత పతకంతో సత్తా చాటిన భారత హైజంపర్ ప్రవీణ్ కుమార్ ఈ సారి మరింత బలంగా పైకి లేచాడు. తన ప్రదర్శనను మెరుగుపర్చుకుంటూ అగ్రస్థానాన్ని అందుకున్నాడు. శుక్రవారం జరిగిన పురుషుల హైజంప్ – టి64 ఈవెంట్‌లో ప్రవీణ్‌కు స్వర్ణ పతకం దక్కింది. 2.08 మీటర్ల ఎత్తుకు ఎగిరి ఆసియా రికార్డుతో అతను పసిడిని గెలుచుకున్నాడు. అమెరికాకు చెందిన డెరెక్ లాసిడెంట్ (2.06 మీ.) రజతం గెలుచుకోగా, తెమూర్‌బెక్ గియాజోవ్ (ఉజ్బెకిస్తాన్ – 2.03 మీ.)కు కాంస్యం దక్కింది. ముందుగా 1.89 మీటర్ల ఎత్తుతో మొదలు పెట్టిన ప్రవీణ్ తన ఏడో ప్రయత్నంలో అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేశాడు. పారిస్ పారాలింపిక్స్‌లో శరద్ కుమార్, మరియప్పన్ తంగవేలు తర్వాత భారత్ తరఫున హైజంప్‌లో పతకం సాధించిన మూడో అథ్లెట్‌గా ప్రవీణ్ నిలిచాడు.

కస్తూరికి ఎనిమిదో స్థానం...

మహిళల పవర్‌లిఫ్టింగ్ 67 కేజీల విభాగంలో భారత ప్లేయర్ కస్తూరి రాజమణికి నిరాశ ఎదురైంది. మూడు ప్రయత్నాల్లో రెండు ఫౌల్స్ కాగా, అత్యుత్తమంగా 106 కిలోల బరువు మాత్రమే ఎత్తిన కస్తూరి ఎనిమిదో స్థానంతో ముగించింది. మహిళల కనోయింగ్ 'వా' సింగిల్ 200 మీ. హీట్స్‌లో రాణించిన ప్రాచీ యాదవ్ సెమీ ఫైనల్‌కు అర్హత సాధించింది. కనోయింగ్ 'కయాక్' సింగిల్ 200 మీ. కూడా భారత ప్లేయర్ పూజ ఓఝా సెమీస్‌కు చేరింది. పురుషుల 'కయాక్' సింగిల్ 200 మీ.లో యష్ కుమార్ కూడా సెమీ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. పురుషుల జావెలిన్ త్రో – ఎఫ్ 54 కేటగిరీలో భారత అథ్లెట్ దీపేశ్ కుమార్ అందరికంటే చివరగా ఏడో స్థానంతో ముగించాడు. అతను జావెలిన్‌ను 26.11 మీటర్ల దూరం విసిరాడు. పురుషుల 400 మీ. – టి47 ఈవెంట్ తొలి రౌండ్ హీట్స్‌లో మూడో స్థానంలో నిలిచి దిలీప్ గవిట్ ముందంజ వేశాడు. మహిళల 200 మీ.–టి12 పరుగు సెమీ ఫైనల్లో రాణించిన సిమ్రన్ ఫైనల్‌కు అర్హత సాధించింది. మహిళల జావెలిన్ త్రో –ఎఫ్ 46లో భావనాబెన్ చౌదరి 39.70 మీటర్లు జావెలిన్‌ను విసిరి ఐదో స్థానంలో నిలిచింది.

బరిలోకి దిగితే పతకం ఖాయమే!



ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రవీణ్ కుమార్ పుట్టుకతోనే వికలాంగుడు. అతని ఎడమ కాలు పూర్తిగా ఎదగకుండా చిన్నగా ఉండిపోయింది. చిన్నతనంలో కొందరు హేళన చేయడం అతడిని తీవ్రంగా బాధపెట్టేది. దీనిని మర్చిపోయేందుకు అతను ఆటలపై దృష్టి పెట్టాడు. వైకల్యం ఉన్నా సరే దానిని పట్టించుకోకుండా మిత్రులతో కలిసి వాలీబాల్ ఆడేవాడు. అయితే అనూహ్యంగా ఒక సారి సాధారణ అథ్లెట్లు పాల్గొనే హైజంప్‌లో అతనికీ అవకాశం దక్కింది. దాంతో అథ్లెటిక్స్‌తో తనకు మరిన్ని అవకాశాలు ఉన్నాయని ప్రవీణ్‌కు అర్థమైంది. సత్యపాల్ సింగ్ అనే పారా అథ్లెటిక్స్ కోచ్ అతనిలో ప్రతిభను గుర్తించి హైజంప్‌పై పూర్తిగా దృష్టి పెట్టేలా చేశాడు. అన్ని రకాలుగా ప్రవీణ్‌ను తీర్చిదిద్దాడు. అనంతరం పారా క్రీడల్లో పాల్గొంటూ అతను వరుస విజయాలు సాధించాడు. టోక్యో పారాలింపిక్స్‌లో రజతం, ఇప్పుడు స్వర్ణంలతో పాటు ప్రవీణ్ వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఒక రజతం, ఒక కాంస్యం కూడా గెలిచాడు. పారిస్ క్రీడలకు ముందు గజ్జల్లో గాయంతో బాధపడిన అతను సరైన సమయానికి కోలుకొని సత్తా చాటాడు.




దీప్తికి ఘన స్వాగతం

పారిస్ పారాలింపిక్స్ క్రీడల్లో కాంస్య పతకం గెలుచుకున్న తెలంగాణ అథ్లెట్ దీప్తి జివాంజి హైదరాబాద్‌కు చేరుకుంది. శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయంలో ఆమెకు క్రీడాకారులు, కోచ్‌లు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్స్) అధికారులు ఘనస్వాగతం పలికారు. పారాలింపిక్స్ 400 మీ. (టి20) పరుగులో దీప్తి కాంస్యం సాధించింది. విమానాశ్రయంలో ఆమె వెంట అథ్లెటిక్స్ కోచ్ నాగపురి రమేశ్, భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్, 'శాట్స్' చైర్మన్ శివ సేనా రెడ్డి తదితరులు ఉన్నారు.

ఫైనల్లో జెస్సికా, సబలెంకా

- సెమీస్‌లో ఓడిన ముచొవా, నవారో
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



సబలెంక



జెస్సికా

న్యూయార్క్: అమెరికా టెన్నిస్ స్టార్ జెస్సికా పెగూలా తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో టైటిల్ పోరుకు అర్హత సంపాదించింది. గ్రాండ్‌స్లామ్ కెరీర్‌లో తొలిసారి సెమీస్ చేరిన ఆమె తన ప్రదర్శనను మరింత మెరుగుపర్చుకుంటూ ఈ సారి సొంతగడ్డపై యూఎస్ ఓపెన్‌లో ఫైనల్ చేరింది. భారత కాలమాన ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ఆరో సీడ్ జెస్సికా 1-6, 6-4, 6-2తో కరోలినా ముచొవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచింది. అయితే మరో అమెరికన్ ఎమ్మా నవారో ఆట సెమీస్‌తోనే ముగిసింది. రష్యన్ స్టార్, గత యూఎస్ ఓపెన్ రన్నరప్ అరినా సబలెంక 6-3, 7-6 (7/2)తో 13వ సీడ్ ఎమ్మా నవారోను వరుస సెట్లలో ఇంటిదారి పట్టించింది. నేడు జరిగే ఫైనల్లో పెగూలా తన తొలి గ్రాండ్‌స్లామ్ కోసం, సబలెంక తన మూడో గ్రాండ్‌స్లామ్ కోసం తలపడతారు. సబలెంకా 2023, 2024లలో వరుసగా ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గింది.

తొలి సెట్ కోల్పోయినా...

క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్‌ను ఓడించిన జెస్సికాకు సెమీస్ పోరు అంత సులువుగా సాగలేదు. మ్యాచ్ ఆరంభంలో ఫ్రెంచ్ ఓపెన్ 2023 రన్నరప్, చెక్ రిపబ్లిక్ ప్లేయర్ ముచొవా చెలరేగి ఆడింది. తొలి 12 విన్నర్లలో పది విన్నర్లను ఆమె కొట్టింది. తొలి సెట్‌లో పెగూలా అదేపనిగా చేసిన తప్పిదాలు, పేలవమైన సర్వీస్‌తో వెనుకబడింది. ఇదే అదనుగా పట్టు బిగించిన ముచొవా 28 నిమిషాల్లోనే తొలి సెట్‌ను వశం చేసుకుంది. రెండో సెట్‌లోనూ తొలి 9 గేముల్లో ఎనిమిదింట గెలిచి ఒక దశలో 3-0తో ఆధిక్యంలో నిలిచింది. కానీ ఇక్కడి నుంచి సీన్ మారిపోయింది. జెస్సికా జోరు మొదలైంది. ఫోర్‌హ్యాండ్ షాట్లతో ఆటలో వేగం పెంచింది. మూడు బ్రేక్ పాయింట్లతో రెండో సెట్‌ను గెలిచి మ్యాచ్‌లో నిలిచింది. మూడో సెట్లో చెక్ ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశమివ్వకుండా జెస్సికా మెరుపు షాట్లతో విరుచుకుపడింది.

సబలెంక జోరు

మరో సెమీఫైనల్లో రష్యన్ స్టార్ సబలెంక జోరుకు ఎమ్మా నవారో ఎదురు నిలువలేకపోయింది. ప్రత్యేకించి యూఎస్ ఓపెన్‌లో తొలిరౌండే దాటని అమెరికన్ ప్లేయర్ ఎమ్మా నిరుటి రన్నరప్ సబలెంక ధాటికి తొలిసెట్‌లో చతికిలబడింది. తొలిసెట్‌ను 6-3తో గెలుచుకున్న రెండో సీడ్ సబలెంకకు రెండో సెట్‌లో కాస్తా పోటీ ఇవ్వడంతో ఈ సెట్ టైబ్రేక్‌కు దారితీసింది. అయితే టై బ్రేక్‌లో అనుభవజ్ఞురాలైన రష్యన్ అలవోకగా పాయింట్లు సాధించడంతో కేవలం గంటన్నరలోనే మ్యాచ్ ముగిసింది. సబలెంక 8 ఏస్‌లతో చెలరేగింది. 34 విన్నర్లు కొట్టింది. ఒకే ఒక ఏస్ సంధించిన నవారో 13 విన్నర్లే కొట్టగలిగింది.